# మనిషికాదు-మట్టి

వై. రఘునాధరావు

అది కాశ్మీరులోని ఒక పల్లెటూరు.

సాయం సమయం. మీర్ ఖాసిమ్ వాకిట్లో నులక మంచం మీద కూర్చున్నాడు. అతని బీబీ హుక్కాలో నిప్పు పోసి లోనికి వెళ్ళింది. హుక్కాలోంచి రెండు మూడు దమ్ములు గుడగుడమని పీల్చి సంతృప్తిగా నిట్టూర్చేడు మీర్ కాసిమ్. లోయలోని కొండగాలి అతణ్ణి గిలిగింతలు పెడుతోంది.

ఇంట్లోంచి కోడి కాల్చిన వాసన వస్తోంది.

"అప్పుడే వంట చేసేస్తున్నావ్. ఇంకా చీకటయినా పడలేదు. వాడెప్పు డొస్తాడో ఏమిటో!" అన్నాడు నవ్వుతూ ఇంటి వైపు తిరిగి.

బీబీ సావడిలోకి వచ్చి తలుపు వెనకాల నిల్చుంది.

"ఒకవేళ వేగం వస్తే? పాపం ఎంత ఆకలితో ఉంటాడో ఏమో!" అన్నదామె.

మీర్ కాసిమ్ భార్యకి వినపడేలా ఒక పెద్ద నిట్టూర్పొకటి వదిలేడు.

"ఆ మరది మీదుండే అభిమానంలో కాస్తయినా ఈ కట్టుకున్నవాడిమీద ఉంటే ఎంత బాగుణ్ను! ఏ జన్మలో నా కెప్పుడయినా ఇలా వేడి వేడి మసాలా వంట పెట్టేవ్?"

"అబ్బే! అసలు మీకు నేను రోజూ బోజనమేనా పెడితేగా! అందుకే పాపం, ఆ పొట్ట అలా మాడి మాడి గుమ్మడి కాయలా తయారయింది."

మీర్ కాసిమ్ బిగ్గరగా నవ్వి బొజ్జని చేతితో ప్రేమగా తడుముకున్నాడు.

"ఏం మీర్ భాయ్! మా హుషారుగా ఉన్నావు ఈ వేళ?" అని పలకరించేడు దారిన పోతున్న స్నేహితుడొకడు. మీర్ కాసిమ్ భార్య చప్పున లోనికి పోయింది.

"రా షఫీర్ భాయ్! రా-కూర్చో" అన్నాడు మీర్ కాసిమ్ మంచం మీద జాగా చేస్తూ,

"నా మేనమామ కొడుకు శ్రీనగర్ నుంచి ఇవాళ వస్తున్నాడు - కోతలకి సాయం చెయ్యడానికి" అన్నాడు.

ఈ అబద్ధం ఆ ఊరివాళ్ళందరికీ తెలుసు. ఆ శ్రీనగర్ మేనమామ కొడుకు పాకిస్తాన్‌లో ఉన్న ఇతని తమ్ముడే అని అతడిదివరకు అయిదారుసార్లు వచ్చి వెళ్ళేడు. కాని ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. మీర్ కాసిమ్ పలుకుబడి అటువంటిది ఆ పల్లెలో ఇతని సలహా లేనిదే ఏ పనీ జరగదు. ఏ పెళ్ళీ కాదు. ఏ సంబరం తలపెట్టరు. ఈ పదవి అతడు డబ్బుతోనూ, హోదాతోనూ కొనుక్కున్నది కాదు. మంచితనంతోనూ, నిజాయితీతోనూ సంపాదించుకున్నది.

మీర్ కాశిమ్ అందించిన హుక్కా పీలుస్తూ షఫీర్ అన్నాడు, "మీరిద్దరూ కలిసి వుంటే ఎంత బాగుణ్ను!"

"నిజమే. మేమిద్దరం కలిసి వుంటే ఎంత బాగుణ్ను!" అనుకున్నాడు మీర్ కాసిమ్,

పద్దెనిమిది సంవత్సరాల ఎడబాటిది! కాశ్మీరు రెండు ముక్కలయినప్పుడు తన తండ్రి రెండవ భార్యతో అటువేపు వెళ్ళిపోయాడు, తన తల్లి మాత్రం అతని వెంట వెళ్ళడానికి నిరాకరించింది.

"ఇది నా జన్మభూమి. ఇక్కడినుంచి నేను కదిలేది లేదు" అన్నది తన తల్లి.

మీర్ కాశిమ్ తల్లితో ఉండడానికే నిశ్చయించుకున్నాడు, కన్నీళ్ళతో తండ్రికి వీడ్కోలు ఇచ్చేడు. మీర్ కాశిమ్ కప్పుడు పాతిక సంవత్సరాలు. అతని సవతి తల్లి కొడుకు అతనికంటె పదిహేను సంవత్సరాలు చిన్న.

ఈ పద్దెనిమిది సంవత్సరాలలో చాలా మార్పులు వచ్చేయి. తన తండ్రి, తల్లులు చనిపోయేరు. తమ్ముడు అక్కడ పెళ్ళి చేసుకున్నాడు. వాడికిప్పుడు ఇద్దరు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల. తన భార్య కూడా నలుగురు బిడ్డల్ని కన్నది. కాని ఒక్కరూ దక్కలేదు.

"అల్లాకి దయలేదా!" అనుకున్నాడా మీర్ కాసిమ్.

మరొక బీబీని కట్టుకొమ్మంది అతని భార్య. మీర్ కాసిమ్ నిరాకరించేడు. తమ్ముడిదివరకు వచ్చిన ప్రతిసారీ అడుగుదామా వద్దా అని సంకోచిస్తూ వచ్చేడు. ఈసారి తప్పకుండా అడగాలి. తమ్ముడి కొడుకుల్లో ఒకణ్ణి తనకి పెంపకాని కిచ్చేస్తే ఈ ఇంటికో నిండుతనం వస్తుంది.

"నీ చెరుకు ఎలా పండిందీ సంవత్సరం?" అన్నాడు మీర్ కాసిమ్ షఫీర్‌తో.

"అల్లా దయవల్ల ఈ ఏడు పంట బాగుంది. కోతలయిపోగానే నా కూతురి నికాహ్ చేసేస్తాను. మరి నువ్వే పెళ్ళి పెద్దవి" అన్నాడు షఫీర్.

"ఎంత మాట! ఎంత మాట! తప్పకుండా ఎవరికిస్తున్నావ్? ఆ సుబేదార్ కొడుక్కేనా? కుర్రవాడు నెమ్మదైనవాడు, యోగ్యుడు!"

"ఆ కుర్రాడే! నీకు తెలియందేవుం
భాయీజాన్! ఢిల్లీలో ఏదో పెద్ద చదు
చదువుతున్నాడు."

సంభాషణ సాగుతోంది. చీక
పడింది. తమ్ముడు మాత్రం ఇం
రాలేదు. బాగా పొద్దుపోయేక షఫీర్ వె
పోయేడు. ఊరి పొలిమేరల్లోంచి తుపా
కాల్పుల శబ్దం వినిపించింది. అటువై
పరుగెత్తాడు మీర్‌కాసిమ్ క్రమక్రమం
శబ్దం హెచ్చవుతోంది.

"ఆగు. ఎవరక్కడ?" అని చీకటి
గర్జించేడు సెంట్రీ.

"నేను మీర్‌కాసిమ్‌ని."

"చేతులెత్తి ముందుకు రా!" అన్నాడ
సెంట్రీ. దగ్గరికి రాగానే గుర్తుపట్టేడ
అతని మొఖాన చిరునవ్వు వెలిసింది. జేబ
లోంచి బీడీ పాకెట్టు తీశాడు. ఇద్దరు
రెండు బీడీలు వెలిగించేరు.

"మియా! మా దగ్గర పంచదార అ
పోయింది. కాస్త సర్దుబాటు చేస్తావ్
మారేషన్ రాగానే ఇచ్చేస్తాను. వెధవ
'చా' నీళ్ళు లోపలికి పోకపోతే పిచ్చె
నట్టుంది," అన్నాడు సెంట్రీ,

"అలాగే పంపిస్తాను. కాని ఏద
కాల్పులవుతున్నాయ్?" అని ప్రశ్నా
కంగా చూసేడు మీర్‌కాసిమ్.

"ఎవడో పాకీస్తానీవాడు ఇటువైపు
రావడానికి ప్రయత్నం చేసిఉంటాడు"
అన్నాడు సెంట్రీ.

మీర్‌కాసిమ్‌కి ముచ్చెమటలు పోసేయి.
కాళ్ళు వణకడం మొనలుపెట్టేయి.

"దొరికేడా?" అన్నాడు నీరసంగా.

"ఏమో! నాకేం తెలుసు? పంచదార
మరచిపోకూ?'! అంటూ సెంట్రీ చీకట్లో
నడుచుకుంటూ పోయేడు.

బరువుగా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి
చేరేడు మీర్ కాసిమ్ అతని బీబీ ఆత్రుతగా
ఎదురుచూస్తోంది. ఇద్దరూ ఒక్కసారి.

"వచ్చేడా", "కనుపించేడా?"
అన్నారు.

కాస్సేపు నిశ్శబ్దం. తర్వాత అమె
తాపీగా అన్నది. "పొరుగింటామె మన
హవల్దారు ఎవడో పాకీస్తానీవాణ్ణి పట్టు
కున్నాడని చెప్పింది,"

మీర్‌కాసిమ్ చప్పున లేచేడు.

"ఇంతసేపూ చెప్పవేం? కనుక్కొని



వస్తానుండు" అని పోలీసు
ఠాణావైపు పరుగులెత్తేడు.
ఒగరుస్తుకుంటూ
వస్తున్న మీర్‌కాసిమ్‌ని
చూసి గాభరాపడ్డాడు
హవల్దారు,

"అరె! ఏం జరిగింది భాయ్‌సాబ్! ఏం
జరిగింది?"

హవల్దారు జోళ్ళు రెండూ తీసేసి
కుర్చీలో కూర్చొని కాళ్లు టేబిల్‌మీద చేర
వేసేడు అతడు అంత పొట్టి కాకపోయినా
బాగా పొట్టకుంది నడుం దగ్గర అడ్డుకొలత
ఎక్కువగా ఉన్నవాడవడంచేత పొట్టిగా
కనుపిస్తాడు. ఈ కారణం చేత అతడు
కుర్చీలోంచి లేవడానికి ప్రయత్నంచేయ
డంలో కాస్త ఆలస్యమయింది.

మీర్‌కాసిమ్ మాటలు తడబడుతూ,
"నువ్వెవరినో పాకీస్తాన్ వాణ్ణి పట్టు
కున్నావటగా?" అన్నాడు.

హవల్దారు జోళ్ళు తొడుక్కుంటూ
'అబ్బే! ఎవరన్నారు? ఎవడో తాగుబోతు
పిచ్చిపిచ్చిగా తాగుతూ అల్లరి చేస్తుంటే
పట్టుకుని లోపల పెట్టాను" అన్నాడు.

తన తమ్ముడు తాగుతాడని తెలుసు.
కాని ఇలా ప్రవర్తిస్తాడా? ఏమో!

"ఏదీ వాడినొకసారిచూడనీ." అన్నాడు
హవల్దారుతో.

హవల్దారు నవ్వేడు. 'నీ బంధువు
డెవడూ కాదుకద?"

"అబ్బే. మరేమీలేదు, నా మేనమామ
కొడుకొకడు శ్రీనగర్‌నుంచి సాయంత్రం
బస్సులో రావాలి. ఆ బస్సులో రాలేదు,
ఒకవేళ పొరుగూరిలో దిగి నడుచుకుంటూ
వచ్చేడేమోనని...."

హవల్దారు మళ్ళీ నవ్వేడు. "బలే బలే!
మంచి బంధువుణ్ణి సంపాదించేవయ్యా.
కోతలకేనా సాయం పంపించేవు.
ఇకనేం? అందరి పంట కోతలయే
లోగా నీ బళ్ళు పట్నం చేరిపోతాయి.
పద పద మనవాడి దర్శనం చేసుకుందాం"
అన్నాడు తాళం చెవుల గుత్తి డ్రాయరు
లోంచి తీస్తూ.

లాకప్‌లో ఉన్నవాడు తన తమ్ముడు
కాడు హరికెన్ లాంతరు వెలుతురులో
నిద్రపోతూ కనుపించిన మొఖం మరో
వ్యక్తిది. ఒక నిట్టూర్పు విడిచేడు మీర్
కాసిమ్ నుదుటనున్న చెమట బిందువుల్ని
పొత్తుకుంటూ "వీడు మావాడు కాడు"
అన్నాడు.

"బతికించేవు పద" అన్నాడు హవ
ల్దారు. ఇద్దరూ పోలీసు ఠాణా బయటకి
నడిచేరు. హవల్దారు దగ్గర శలవు తీసు
కున్నాడు మీర్ కాసిమ్.

ఊరవతల ఉన్న అడవివైపు నడిచేడు
అమవస నిశి. నక్కలు వికారంగా అరు
స్తున్నాయి. చుట్టుపక్కల జన సంచారం
లేదు. అలా ఒంటరిగా నడచుకుంటూ
పోతున్నాడు. మరో రోజయితే అతడికి
భయంవేసి ఉండును. ఇవాళ అతని మన
స్సులో ఒకేఒక ఆలోచన మెదులుతోంది.
తమ్ముడేమయినట్టు? అలా ఒక గంట
నడిచిన తర్వాత పాడుపడ్డ మసీదొకటి
చేరుకున్నాడు. చీకటిలో నిదురపోతున్న
మసీదు గోడలలో ఏదో చప్పుడయి
నట్లయింది మీర్‌కాసిమ్‌కి.

"తమ్ముడూ!" అని పిలిచేడు ఆశగా.

"తమ్ముడూ," అని వెక్కిరించేయి
నిశీధిలోని ప్రతి ధ్వనులు. ఆ చీకటిలోనే
మసీదంతా వెదికి మరోసారి "తమ్ముడూ"
అన్నాడు ఈమారు కాస్త బిగ్గరగా. మళ్లీ
మసీదు గోడల్లోని గొంతుకలు వంత

పాడేయి,

మసీదుకు సమీపంగా అడివి కొని పొదలు బుసలు కొడుతున్నాయి.

ఆ పొదలదగ్గరకి వెళ్ళి ఏదో ఆనవాలు కోసం వెతికేడు మీర్‌కాసిమ్. కాస్సేపటికి ఆనవాలు దొరికింది. అదొక పెద్ద కొండ రాయి. ఆరాయి చాటున ఓ చిన్న కాలిబాట ఉంది. ఆ కాలిబాట అడివిలోకి చొచ్చుకొని పోతుంది. ఆ బాట ఎవరూ ఎప్పుడూ వాడలేదు. అసలదొక బాట అన్నది ఎవరికీ తెలియదు—తనకీ. తనతమ్ముడికీ తప్ప. ఆ బాటలో నడవసాగేడు. కొన్ని కొన్ని చోట్ల పాకిరావలసి వచ్చింది. మరికొన్ని చోట్ల దారికి అడ్డంగాఉన్న కొమ్మలు నరకవలసి వచ్చింది. ఒళ్ళంతా ముళ్ళతో గీరుకొని రక్తం చిమ్మి మండుతోంది. అలా చాలా దూరం వెళ్లేడు.

"తమ్ముడూ!" అని పిలుస్తునే ఉన్నాడు, జవాబు రాలేదు. ఆఖరికి నిరాశతో వెనుతిరిగేడు,

కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చేసరికి నడిరాత్రి దాటింది. గుమ్మం ఎక్కబోతూ ఎదురుగా ఉన్న దృశ్యం చూసి నిర్ఘాంతపోయేడు తన తమ్ముడు నవ్వుతూఅరుగుమీద తన మంచంమీద కూర్చొనిహుక్కా పీలుస్తున్నాడు. ద్వారానికి లోపున తన భార్య కూర్చొని ఏవో కబుర్లు చెబుతోంది.

మీర్‌కాసిమ్‌ని చూడగానే తమ్ముడు హుక్కా వదిలి పరుగెత్తుకుంటూవచ్చి గాఢంగా కావిలించుకున్నాడు. మీర్‌కాసిమ్ కళ్ళవెంట వెచ్చనినీరుటపటపమని తమ్ముడి భుజంమీద పడింది. ఏవేవో మాటలు చెపుదామని నోరు రెండుమూడుసార్లు తెరిచేడు. కాని అతని నోటంట ఒక్క మాట కూడా రాలేదు.

ఆరాత్రి భార్య, తమ్ముడు నిద్రపోయిన తర్వాత మీర్‌కాసిమ్ అనంతాకాశంముందు మోకరిల్లి "యా అల్లా! నువ్వు చాలా దయామయుడివి" అన్నాడు. ఆకాశం




అతని హృదయంలా ప్రశాంతంగా నిర్మలంగా ఉంది. గాఢమైన నిదురలో తియ్యని కలలు లాగున్నాయి నింగిలోని నక్షత్రాలు.

మర్నాడు రోజంతా అన్నదమ్ములు ఒకరినొకరు విడవకుండా తిరిగారు. అన్న పొలాల్లోని పంటమాసి మురిసిపోయేడు తమ్ముడు. పరిచయమున్న వాళ్ళంతా పలకరించి యోగక్షేమాలడిగేరు, హపల్దారు హాస్యమాడాడు. "అయితే నీ తాగుబోతు బంధువు ఎలాగైతేనే ఇల్లు చేరుకున్నాడన్నమాట!" అన్నాడు. పెంపకం గురించి ప్రస్తావన ఎత్తగానే తమ్ముడు వెంటనే "అలాగే కానీయ్. నాకేం అభ్యంతరం లేదు" అన్నాడు. మీర్‌కాసిమ్ ఇచ్చిన పంచదారతో సెంట్రీ టీ కాచి ఇద్దరితోనూ కలిసి తాగేడు.

రాత్రి భోజనాలు చేస్తుంటే తమ్ముడన్నాడు "అన్నట్లు నాకోపని చేసిపెడతావా?"

"ఏమిటది!" అన్నాడు మీర్‌కాసిమ్.


"మన హైదరు మేనమామ చావుబతుకుల్లో ఉన్నాడు. చచ్చేముందు తన మేనల్లుణ్ణి ఆకరుసారిగా చూడాలని ఉందన్నాడు ముసిలాడికి వాగానం ఇచ్చేను. మన గొడవల్లోపడి ఈ సంగతే మర్చిపోయాను. ఈ రాత్రి హైదరని ఏలాగైనా మావైపు పంపించాలి. ఏదో ఆస్తి పంపకాల గొడవ కూడా ఉంది. వీడు వెళ్ళేలోగా ఆ ముసలాడు గుటుక్కుమంటే చాలా గొడవలు జరుగుతాయి. ఈ ఉపకారం నాకు చేసి పెట్టవ్?"

మీర్ కాసిమ్‌కి ఈ పని ఎంతమాత్రం ఇష్టంలేదు,

"వొద్దు తమ్ముడూ! ఆదారి మూడో వాడికి తెలియకుండా ఉంటేనే మంచిది. ఎందుకొప్పుకున్నావ్?"

"వాడి మామకి గవర్నమెంటులో బోలెడు పలుకుబడుంది, వాళ్ళకి నేను కాదంటే నా కుటుంబాన్ని సఫా చేస్తారు.

మీర్‌కాసిమ్ ఆలోచనలో పడ్డాడు. హైదరుఉన్న గ్రామం ఇరవైమైళ్ళ దూరంలో ఉంది. మరోగంటకి ఆ గ్రామం గుండా పోయే బస్సు ఒకటి దొరుకు





తుంది. మళ్ళీ తెల్లవారుజామునఅటును
తిరుగుబస్సు ఉంది. వేకువ మసకచీకటి
హైదరుకాదారి చూపించి పంపించాలి.

!?సరే అయితే నేనీ ఆఖరుబస్సు వెళతాను. రేపు మొదటి బస్సులో వా తీసుకొస్తాను. నువ్వామసీదుదగ్గర ఉండ అన్నాడు మీర్ కాసిమ్.

"అలాగే" అన్నాడు తమ్ముడు.

బస్సుస్టాండుకొచ్చి బ స్సె క్కిం వీడ్కోలిచ్చేడు అన్నకి. ఊరుదాటి అ దారుమైళ్ళు వెళ్ళిందోలేదో బస్సు పోయింది. కండక్టరు, డ్రైవరు కిందకిది బస్సులోని భాగాలని తణిఖీచేసి ఎదో వి పోయింది. ఈ రాత్రికీబస్సు మరి కద దన్నారు.

మీర్ కాసిమ్‌కి చాలా కోపం వచ్చిం డ్రైవరునీ, కండక్టరునీ తిట్టుకున్నా తనసీరాత్రి పంపించిన తమ్ముణ్ని తి కున్నాడు. ఇలా రాత్రివేళ బయలుదే తనకి తగిన శాస్తి అయిందనుకున్నాడ క్రితం రాత్రికిమల్లే కాళ్ళీడ్చుకుంటూ ఊరికి తిరుగుముఖం పట్టాడు.

పాడుపడ్డ మసీదు సమీపించగానే వ దులోనుంచి ఏవో గొంతుకలు వినిఃచేయి. ఒక్కసారిగా మీర్ కాసిమ్ స్థంభిం పోయేడు.

"మిగతావాళ్ళేరి?" ఒక గొంతు అ గింది.

"అడివిలో ఉన్నారు!" రెండవగొం సమాధానం.

"నిన్నరాత్రే వాళ్ళతి తీసుకురమ్మ చెప్పెగా?" మళ్ళీ మొదటిగొంతు.

"నువ్వు చెబుతే సరా? నాకు దారి తె యొద్దూ? నీ వెనకాలే ఒచ్చేసేను గా మళ్లీ వెనక్కు వెళదామంటే దారి మ కనిపించలేదు. దారివెతుక్కుంటూ వుం ఆ చీకట్లో ఎవడో 'తమ్ముడూ,తమ్ముడు అని అరుచుకుంటూ వొచ్చేడు. వాడికేద అనుమానం వేసినట్లుంది. ఆ చీకటిలో




మసీదంతా కాలుకాలిన పిల్లిలా తిరిగేడు. నా అదృష్టం బాగుండి వాడి చేతుల్లో చిక్క లేదు. తర్వాత ఎటుపోయేటో మరి కనిపించ లేదు. ఆ భయంతో ఈ రోజంతా నీ కోసం కాచుకోని ఇక్కడే ఇలా దాక్కు న్నాను."

"ఉద్ధరించేవు. పద."

మాట్లాడుకుంటున్న ఇద్దరు వ్యక్తులూ బయటకి వచ్చేరు. మీర్ కాసిమ్ గోడ చాటుకి నిశ్శబ్దంగా జరిగేడు. అందులో ఒకడు తన తమ్ముడు. తమ్ముడి గొంతు కని పోల్చినా వాడిని చూసేదాకా నమ్మకం కుదరలేదు మీర్ కాసింకి. వాళ్ళిద్దరూ బండ రాయివైపు నడిచి అడివిలోకి మాయమ య్యేరు. వాళ్ళు పరుగైన కొద్దిసేపటికి ఊరివైపు పరుగులెత్తేడు మీర్ కాసిమ్.

* * *

పాడుపడ్డ మసీదుగోడల వెనక దాక్కు న్నారు జవాన్‌లు.

"ఏరీ? ఇంకా రారేం?" అన్నాడు హవ ల్దారు మెల్లగా.

"ఇష్!" అన్నాడు జవాన్‌లలో ఒకడు.

మిగిలినవాళ్ళు తమ తమ జాగాల్లో కొంచెం అటూ ఇటూ సర్దుకున్నారు.

మీర్ కాసింలో మాత్రం ఏమీ చలనం లేదు. బండరాయివైపు తప్పించకుండా చూస్తున్నాడు.

"అదుగో!" అన్నారెవరో చీకట్లో.

బండరాయివెనక వెదురు పొద కది లింది. పరిసరాల్లోని కీచురాళ్ళ సంగీతానికి అపశృతి కలిసింది పొదల్లోని జోళ్ళ చప్పుడు.

ఒకటి—రెండు—మొత్తం పన్నెండు మానవాకారాలు అడివినుండి వేరై మసీదు వైపుకి నిడిచేయి.

పన్నెండు ఆకారాలూ బాగా దగ్గరికి వచ్చేయి. అందులోనుంచి ఒకడు మిగిలిన జట్టునుంచి ముందుకు వడివడిగా నడిచేడు. ఆ వ్యక్తిలో తన తమ్ముణ్ని గుర్తుపట్టేడు మీర్ కాసిమ్.

"ఫైర్!" అని చీకటిని చీల్చుకుంటూ అజ్ఞ వచ్చింది.

జవాన్‌లు పేల్చిన మొట్టమొదటి గుండు తన తమ్ముడి గుండెని దూసుకుంటూ పోయింది.

* * *

తెల్లవారుజామున మీర్ కాసిమ్ ఇంటికి వచ్చేసరికి అతని బీబీ మేలుకొని ఉంది.

"మరిది ఏడీ?" అంది.

'హైదరుతో పంపించేసేను" అన్నాడు మీర్ కాసిమ్.

"అదేం అలా చేసేరు?" అందామె ఆశ్చర్యంగా.

అతను జవాబు చెప్పకుండా సావడి లోని మంచంమీద కూలబడ్డాడు.

"మళ్లీ ఎప్పుడొస్తాడు?" అన్న దామె.

"మరిరాడు. ఈ జన్మానికి మరిరాడు" అని రెండు చేతుల మధ్యా తలని ఉంచి ఒక్కసారిగా గొల్లుమని ఏడవడం మొదలు పెట్టాడు మీర్ కాసిమ్. *